క్లుప్తంగా

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



గేదె కళేబరం

దుబ్బాక: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. దుబ్బాక పట్టణానికి చెందిన రైతు మల్లుగారి అనిల్ రెడ్డి తన పాడిగేదెలను మంగళవారం ఉదయం మేత కోసం వదిలాడు. కర్నాల బావి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అక్కడ గడ్డి మేస్తున్న క్రమంలో విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదె మృతితో తనకు రూ.60 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు. ఘటన స్థలాన్ని ఆర్‌ఐ నర్సింహారెడ్డి పరిశీలించాడు.

వాహనాల తనిఖీ



బస్వాపూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కోహెడరూరల్(హుస్నాబాద్): పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎస్‌ఐ తిరుపతి మండలంలోని బస్వాపూర్ గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు, బంగారం ఇతర వస్తువులు తీసుకెళ్లేవారు వాటి వివరాలు తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని, విధి నిర్వహణలో ఉన్న అధికారులకు సహకరించాలన్నారు.

హుస్నాబాద్ డిపో మేనేజర్‌కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలం కొండాపూర్ గ్రామస్తులు బస్సు సౌకర్యం కల్పించాలని హుస్నాబాద్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామం నుంచి రామవరం మీదుగా హుస్నాబాద్‌కు నడిచే బస్సు సర్వీసును రద్దు చేశారన్నారు. మళ్లీ సర్వీసును పునరుద్ధరించాలని కోరారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండలం కమలాయపల్లికి ఈనెల 28వ తేదీన మంత్రి సీతక్క రానున్నట్లు బయో డీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు లింగంపల్లి చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. మహాత్మ జ్యోతిరావుపూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలను మంత్రి ఆవిష్కరిస్తారన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో విగ్రహాల ఆవిష్కరణ వాల్ పోస్టర్ మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు తెలిపారు.

వాతావరణ నిర్ధారణ పథకం ప్రారంభం



వాతావరణ నిర్ధారణ పథకాన్ని ప్రారంభిస్తున్న నాబార్డ్ డీజీఎం తిమోతీ

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట గ్రామంలో ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాతావరణ నిర్ధారణ పథకాన్ని నాబార్డ్ డీజీఎం తిమోతీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో ఫాం పాండ్స్, రాళ్ల గుట్టలు, కూరగాయల పెంపకం, బోరు రీచార్జ్ పనులు చేస్తారని, వాటిని స్థానిక రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేష్, ధాన్ ఫౌండేషన్ రీజినల్ కోఆర్డినేటర్ మల్లికార్జున్, ఝాన్సీ నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆటాడేదెలా!



ఇబ్రహీంనగర్‌లో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి, క్రీడా పరికాలను అందజేసింది. అయితే పంచాయతీలు పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామీణ యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ప్రాంగణాలను ఏర్పాటుచేసినా పర్యవేక్షణలేక నిరుపయోగంగా ఉండటంతో యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం పర్యవేక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- మూలనపడ్డ క్రీడా సామగ్రి
- పంచాయతీల పర్యవేక్షణ కరువు
- వినియోగంలోకి తేవాలని డిమాండ్

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చిన్నకోడూరు మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను నిర్మించింది. గతేడాది సెప్టెంబర్‌లో క్రీడా సామగ్రిని పంపిణీ చేసింది. నిర్వహణపై నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో ప్రస్తుతం ఈ సామగ్రి గ్రామ పంచాయతీల్లో మూలనపడి ఉన్నాయి. ప్రభుత్వం క్రీడా సామగ్రిని అందజేసిన కొద్ది రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. అనంతరం ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో సామగ్రి ఉన్నా క్రీడాకారులకు ఉపయోగపడటం లేదు. వీటిని క్రీడాకారులకు పంపిణీ చేస్తే వారు ఆటల్లో మరిన్ని మెలకువలతో రాణించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది పర్యవేక్షణ లేక..

ప్రాక్టీస్ కోసం క్రీడాకారులకు క్రికెట్ కిట్, వాలీబాల్, నెట్, వ్యాయామ పరికరాలు, డంబెల్స్‌ను పంచాయతీ సిబ్బంది అంజేస్తారు. అయితే క్రీడా మైదనాలు లేకపోవడంతో వాటిని ఎవరూ తీసుకోవడంలేదు. సామగ్రి ఉన్నా నిరుపయోగంగా ఉన్నాయని యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది.

బోర్డులకే పరిమితం

గత ప్రభుత్వం చేపట్టిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమవుతున్నాయి. మొదట్లో వీటి నిర్వహణకు కొంత మేరకు నిధులు ఖర్చు చేశారు. సరిపడా స్థలం లేక గ్రామాలకు దూరంగా క్రీడా స్థలాలను ఎంపిక చేశారు. రాళ్లను తొలగించి క్రీడా ప్రాంగణాలుగా చేశారు. క్రీడా ప్రాంగణాలు ఉన్నా వీటి నిర్వహణ కరువైంది. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం

గ్రామీణ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి క్రీడా పరికరాల కిట్లు అందజేసింది. వీటిని గ్రామ పంచాయతీలు పర్యవేక్షిస్తుంది. క్రీడా కిట్లను పరిశీలించి వినియోగించేలా చర్యలు తీసుకుంటాం. క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువస్తాం.

– జనార్దన్, ఎంపీడీఓ

పంచాయతీలుపట్టించుకోవు



గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. క్రీడా సామాగ్రిని కూడా పంపిణీ చేసింది. అయితే పంచాయతీలు పట్టించుకోపోవడంతో అవి వినియోగంలోకి రాలేదు. క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ఉన్నతాధికారులు తక్షణమే వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– అజయ్, చర్లఅంకిరెడ్డిపల్లి

నీటిని విడుదల చేయించాలని వినతి

కొమురవెల్లి(సిద్దిపేట): జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు చేర్యాలలోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను దేవాదుల నీటితో నింపేలా ప్రభుత్వంతో మాట్లాడాలన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో చెరువుల్లో నీరు లేకుండాపోయిందని, వరి పంట ఎండితే రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నీటిని వదిలి రైతులను ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడికుంట శ్రీనివాస్, ఎక్కలదేవి శ్రీనివాస్, రాములుచారి తదితరులు పాల్గొన్నారు



జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

మున్సిపల్ కంపోస్టు ఎరువు విక్రయం



రశీదు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ ఆధ్వర్యంలో మందపల్లి రిసోర్స్ పార్క్‌లో తయారైన కంపోస్టు ఎరువును మంగళవారం మున్సిపల్ అధికారులు విక్రయించారు. తడిచెత్తతో సేంద్రియ ఎరువులను తయారీ చేస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. రైతు సయ్యద్ సలీం 4,060 కిలోల సేంద్రియ ఎరువు రూ.40,600లకు కొనుగోలు చేశాడు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి కొనుగోలు రశీదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఆధ్వర్యంలో వార్డు స్థాయి కంపోస్టు యార్డులు, మందపల్లి, బుస్సాపూర్ రిసోర్స్ పార్కులలో తడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువుల తయారీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు కిలో రూ.10లకు అందజేస్తున్నామన్నారు. రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘డ్రోన్’ వినియోగించుకోండి



డ్రోన్ పరికరాన్ని అందజేస్తున్న అధికారులు

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

మర్కూక్(గజ్వేల్): రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలని, డ్రోన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ సూచించారు. మంగళవారం మర్కూక్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుల కోసం వ్యవసాయ రంగంలో డ్రోన్ పాత్ర, వాటి ఉపయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పైలెట్ శిక్షణ పొందిన తర్వాత మాత్రమే పిచికారీ చేయాలన్నారు. గాలి వేగం ఎక్కువగా ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లో పిచికారీ చేయవద్దన్నారు. పొడి మందులు వాటినప్పుడు నాజిల్స్‌ను శుభ్రపర్చుకోవాలని, హైటెన్షన్ వైర్లు, చెట్లు ఉన్న వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డ్రోన్ వాడకం ఎంతో మేలు అన్నారు. రూ.16 లక్షల విలువైన డ్రోన్, వాహనాన్ని ఉత్పత్తిదారుల సంస్థకు ఉచితంగా అందజేసినందుకు ఇఫ్కో జిల్లా మేనేజర్ చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్ట్ అమరేష్, మండల ఏఓ నాగేందర్‌రెడ్డి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎల్బీ నగర్ కోర్టులో లా విద్యార్థులు

సిద్దిపేటకమాన్: ఫైనల్ ఇయర్ లా విద్యార్థులు శిక్షణలో భాగంగా ఎల్బీ నగర్ కోర్టుకు హాజరైనట్లు న్యాయకళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీంద్రప్రసాద్ తెలిపారు. సిద్దిపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వినాయక లా కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఎల్బీ నగర్‌కోర్టులో ట్రయల్స్ జరిగే తీరును పరిశీలించారన్నారు. విద్యార్థులు తమ సందేహాలను న్యాయమూర్తులను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పదో అదనపు జడ్జి జయలక్ష్మి, బార్ కౌన్సిల్ మెంబర్, సీనియర్ న్యాయవాది అనంతసేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

గజ్వేల్‌రూరల్: టెట్ ఫీజు పెంపు విద్యార్థులపై ఆర్థికభారం పడే అవకాశముందని, గతంలో మాదిరిగా ఫీజు నిర్ణయించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన గజ్వేల్‌లో మాట్లాడుతూ గతంలో 1 పేపర్‌కు రూ. 200, రెండు పేపర్లకు రూ.300 ఉండగా, ప్రస్తుతం 1 పేపర్‌కు రూ.వెయ్యి, రెండు పేపర్లకు రూ. 2 వేలుగా నిర్ణయించడం సరికాదన్నారు. అంతేకాకుండా పాత 11 జిల్లాల్లో టెట్‌పరీక్షా కేంద్రాల్లో నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్న క్రమంలో విద్యార్థులకు దూర ప్రయాణంతో పాటు వివాహమైన వారు ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని 33 జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

మోటార్ సైకిల్ దొంగ రిమాండ్

కొండపాక(గజ్వేల్): మోటార్ సైకిల్‌ను దొంగిలించిన నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్లు కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన కండ్లకోయ మురళీ దొంగతనాలు చేస్తున్నాడు. మార్చి 23వ తేదీన కుకునూరుపల్లిలో మహమ్మద్ లయీక్ పాషా బైక్‌ను అపహరించాడు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం కుకునూరుపల్లి మండలం మంగోల్ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసులను చూసి నిందితుడు పారిపోతుండగా వెంటపడి పటుకున్నారు. అతడిని విచారించగా బైక్‌ను దొంగిలించిన విషయాన్ని ఒప్పుకున్నాడన్నారు.

వెంచర్ పరిశీలన

- మత్తడి కాలువకు అడ్డంగా నిర్మించిన గోడ తొలగించాలి
- వెంచర్ అనుమతులపై పునఃపరిశీలిస్తాం
- డీటీపీసీ అధికారి వందనం

సాక్షి స్పందన

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుగ్గిల్ల కుంట మత్తడి కాలువను పూడ్చి భూ వ్యాపారులు వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయంపై ‘కాలువ పూడ్చి..వెంచర్ వేసి’ శీర్షికన సాక్షి దిన పత్రికలో ప్రచురితమైంది. కథనానికి డీసీపీసీ అధికారి వందనం స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌తో కలసి మంగళవారం వెంచర్‌ను పరిశీలించారు. గుగ్గిల్లకుంట మత్తడి కాలువకు అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలని కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు ఇచ్చిన నివేదికలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వెంచర్ నుంచి కాలువ వెళ్తోందని పేర్కొనలేదన్నారు. ఈ విషయంపై మరో నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను కోరతామన్నారు. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా అవసరమైతే వెంచర్‌కు ఇచ్చిన అనుమతులను పునఃపరిశీలించి రద్దు చేస్తామన్నారు. అదే విధంగా గుగ్గిల్లకుంట కాలువకు నష్టం జరుగదని, కాలువ యథావిధిగా ఉంటుందని రైతులకు హామీ ఇచ్చారు.



వెంచర్‌ను పరిశీలిస్తున్న డీటీపీసీ అధికారి వందనం

దేశ ప్రగతికి యువతే రథసారథులు

నెహ్రూ యువ కేంద్రం సభ్యుడు మనోజ్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): దేశ ప్రగతికి యువతే రథసారథులని, అర్హులైన యువతీ యువకులు ఓటు హక్కు కలిగి ఉండాలని నెహ్రూ యువ కేంద్రం సభ్యుడు సోగాల మనోజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుహక్కును నిర్లక్ష్యం చేస్తే ప్రశ్నించే హక్కును కోల్పోతామన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సామాజిక కర్యకర్త లక్ష్మణ్, ఐలయ్య, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న నెహ్రూ యువ కేంద్రం సభ్యులు

రైతు రుణమాఫీ ఎప్పుడు?



గజ్వేల్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని ఎప్పుడు అమలు చేస్తారని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, అసెంబ్లీ కోకన్వీనర్ బండారు మహేష్ మాట్లాడారు. రుణాలు చెల్లించకపోవడంత బ్యాంకు అధికారులు రైతులను ఇబ్బందిపెడుతున్నారన్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రుణం తీసుకోనివారు రైతులు వెంటనే బ్యాంకులో రూ. 2 లక్షల వరకు రుణం తీసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ రైతులు, నిరుద్యోగులను మాయమాటలతో మభ్యపెట్టి మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుత సీఎం ఆయన దారిలో పయనిస్తున్నారన్నారు. రైతులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు అంకురార్పణ

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో నిర్మితమైన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున శ్రీక్షేత్రం పీఠాధిపతి శ్రీమధుసూదనానంద సరస్వతి, వర్గల్ ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనం, రక్షాబంధనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, శాలసంస్కారం, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర, లింగతోభద్ర మండపదేవత ఆవాహన ఉపచార పూజలు నిర్వహించారు. వాస్తు పర్యగ్నికరణం, కుండ సంస్కారం, అగ్నిప్రతిష్ఠాపన, ఆవాహిత దేవత హవనములు, జలాధివాసం, నీరాజన మంత్రపుష్పాది పూజలు చేశారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

తెలంగాణ ప్రాదేశిక పద విన్యాస వ్యాసం ప్రచురణ



డాక్టర్ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ భవానీ

దుబ్బాక: అంతర్జాతీయంగా పేరుగాంచిన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సిలికాంధ్ర విశ్వవిద్యాలయం సంయుక్తంగా గత ఏడాది అక్టోబర్ 21–22వ తేదీలలో మిల్పిటాస్ కాలిఫోర్నియాలో 13వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో దాదాపు 80 మంది తెలుగు సాహితీవేత్తలు పాల్గొని తమ రచనలను వినిపించారు. దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఇట్టబోయిన వెంకటేష్ తెలంగాణ ప్రాదేశిక పద విన్యాసం శీర్షికతో రాసిన వ్యాస రచన సదస్సు ఆధ్వర్యంలో విడుదల చేసిన సంచికలో ప్రచురితమైంది. ఈ విషయాన్ని వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సిలికాంధ్ర విశ్వ విద్యాలయం ప్రతినిధులు ఆయనకు ఈమెయిల్ ద్వారా తెలిపారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ భవానీ మంగళవారం వెంకటేష్‌ను సత్కరించారు. తెలంగాణలో కనుమరుగైపోతున్న పద సందను వెలికితీసి తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించినందుకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు నాచగిరి హుండీ లెక్కింపు

వర్గల్(గజ్వేల్): నాచగిరి క్షేత్రంలో బుధవారం హుండీ సొమ్ము లెక్కింపు ఉంటుందని ఆలయ సహాయ కమిషనర్ అన్నపూర్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు.

◆ నిందితుడి రిమాండ్

మద్దూరు(హుస్నాబాద్): దొంగతనం కేసులో నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ షేక్ యూనూస్ అహ్మద్ అలీ తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన దూళ్మిట్ట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ముక్క కనకయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీరువా పగులగొట్టి మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టగా అదే గ్రామానికి చెందిన పాత నేరస్తుడు ముక్క రమేష్ నేరం చేశానని ఒప్పుకున్నాడు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది. కరీంనగర్ జైల్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ నూతన కమిటీ ఎన్నిక

చేర్యాల(సిద్దిపేట): భారత విద్యార్థి ఫెడరేషన్ చేర్యాల డివిజన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పరి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో చేర్యాల డివిజన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సుద్దాల భాస్కర్, ఆముదాల రంజిత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా అత్తిని హారిక, తాడూరి భరత్, సహాయక కార్యదర్శులుగా పుర్మ రాకేష్‌రెడ్డి, నాగపురి కిరణ్, మరో 13 మందితో డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు.

◆ నిందితుడికి జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: మెడికల్ కళాశాలలో సీటు ఇప్పిస్తానంటూ పలు విడతలుగా డబ్బులు వసూలు చేసిన నిందితుడికి సిద్దిపేట కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించినట్లు సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటకు చెందిన ధర్మారం రాజిరెడ్డి కూతురుకు మెడికల్ కళాశాలలో సీటు ఇప్పిస్తానంటూ చిన్నకోడూరు మండలం పెద్దకోడూరుకు చెందిన బొల్లిపల్లి విజయ్ భాస్కర్‌రెడ్డి పలు విడతలుగా రూ.2 లక్షలు తీసుకున్నాడు. మెడికల్ కౌన్సిల్ పర్మిషన్ లేని టీఆర్‌ఆర్ మెడికల్ కళాశాలలో కౌన్సిలింగ్ ఉందని నమ్మించాడని, తిరిగి డబ్బులు ఇవ్వమంటే ఇవ్వలేదు. దీంతో భాస్కర్‌రెడ్డి తనను మోసం చేశాడంటూ రాజిరెడ్డి 2013లో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. సిద్దిపేట అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జరిపిన విచారణలో నిందితుడి నేరం రుజువు కావడంతో అతడికి రూ.వెయ్యి జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. నేరస్తుడికి జైలు శిక్ష పడడానికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రూప తన వాదనలు వినిపించారు. కోర్టు కానిస్టేబుల్ స్వామి, శరత్, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ రాజమల్లు కీలకపాత్ర వహించినట్లు తెలిపారు. నిందితుడికి శిక్షపడేలా దర్యాప్తు చేసిన పోలీసు అధికారులను సీపీ అనురాధ అభినందించారు.

◆ కనీస వేతనం అమలు చేయాలి

గజ్వేల్‌రూరల్: కార్మికులకు కనీస వేతనాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

◆ వందరోజుల్లో విశ్వాసం కోల్పోయింది

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వంద రోజుల్లో ప్రజల విశ్వాసం కోల్పోయిందని మున్సిపల్, సుడా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు రాజనర్స్, రవీందర్ రెడ్డి, సాయిరాం అన్నారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వంపై ప్రజలు కోపంగా ఉన్నారని, ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతు పలకడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

◆ ఏప్రిల్ 3న జాతీయ సదస్సు

వర్గల్(గజ్వేల్): వర్గల్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 3న ‘డిజిటల్ టెక్నాలజీస్ అండ్ చాలెంజెస్ ఇన్ టీచింగ్ ఎవల్యూషన్’ అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. కళాశాల ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహిస్తుందన్నారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన ఆచార్యులు, డిగ్రీ అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు తమ అంశానికి సంబంధించిన అబ్‌స్ట్రాక్ట్ పూర్తి నిడివి పత్రాన్ని మార్చి 28లోగా mjpnationalseminar 2024 @gmail.com కు మెయిల్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 97035 29664, 94406 98470 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.